క్లుప్తంగా

నియామకం


మద్దినేని తేజరాజ్

గోవిందరావుపేట: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పస్రా గ్రామానికి చెందిన మద్దినేని తేజరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం నుంచి తేజరాజ్ నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా తేజరాజ్ మాట్లాడుతూ..నమ్మకంతో పదవి అప్పగించిన జిల్లా రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తేజరాజ్ తెలిపారు.

ఎస్సైని కలిసిన గౌడ సంఘం నాయకులు



కన్నాయిగూడెం: మండలంలోని గౌడ సంఘం నాయకులు మండల అధ్యక్షుడు పాలకుర్తి శ్రీధర్ ఆధ్వర్యంలో మండల ఎస్సై వెంకటేశ్‌ను కలిశారు. నూతనంగా గౌడ సంఘం ఎన్నిక జరిగిన సందర్భంలో కలిసి ఎస్సైకి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం గౌడ సమస్యలను ఎస్సైకి తెలియజేసి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తాడూరి శ్రీధర్, ఉపాధ్యక్షుడు తాటి లచ్చలు, కార్యదర్శి తాటి యాదగిరి, రాజశేఖర కనకసేన, కోరుకొప్పుల దీపక్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీల స్వాధీనం



గోవిందరావుపేట: నకిలీ పత్రాలతో ఇసుకని తరలిస్తున్న రెండు లారీలను పస్రా అటవీ చెక్ పోస్ట్ వద్ద అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం జాతీయ రహదారి 163 పై వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఫేక్ వే బిల్లు జనరేట్ చేసుకొని హైదరాబాద్‌కు వెళ్తుండుగా రెండు లారీలు పట్టుకొని, కేసు నమోదు చేసి రేంజ్ ఆఫీస్‌కు తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భాస్కర్ తెలిపారు. రెండు లారీల్లో ఉన్న ఇసుక విలువ సుమారు రూ.3లక్షల 86 వేల వరకు ఉంటుందని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

ములుగు రూరల్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములుగు పరిధి పాల్‌సాబ్‌పల్లి రోడ్డువైపు ఉన్న కొడిపాక ప్రశాంత్(30) అనే యువకుడు సోమవారం రాత్రి తల్లితో అప్పుల విషయం చెప్పి బాధపడ్డాడని తెలిపారు. రాత్రి భోజనం చేసి నిద్రపోయాక ప్రశాంత్ ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. తల్లి ఉదయం లేచి చూసే సరికి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

పలిమెల: జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హత ఉన్న వారు ఈనెల 30వ వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తహసీల్దార్ అనిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి కుటుంబ పెద్ద సహజ లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా రూ.20 వేలు నగదు అందుతుందన్నారు. మృతి చెందిన రెండు సంవత్సరాలలోపు కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంతోద్యయ అన్న బీమ యోజన, జనశ్రీ బీమ యోజన కింద లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల:మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద కమిటీ సభ్యులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దాసరి సుధాకర్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద కమిటీ సభ్యులు అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్‌తో ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు ఉంటాయని సూచించారు.

పరామర్శ

రేగొండ: మండల కేంద్రానికి చెందిన కునూరు రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఉమేష్ గౌడ్ పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు.

పగలు ఈగలు.. రాత్రి దోమలు

- గ్రామాల్లో వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులు
- కనిపించని ఫాగింగ్
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు


కమలాపురం గ్రామపంచాయతీ పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

మంగపేట: మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య విపరీతమవుతోంది. దీంతో పగటిపూట ఈగలు.. రాత్రి దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్తసేకరణకు వినియోగించే ట్రాక్టర్లు మరమ్మతుకు గురయ్యాయని కొందరు, డీజిల్‌కు నిధులు లేవనే సాకుతో మరికొందరు పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులను చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో అంతర్గత రోడ్లపై చెత్తా చెదారం పేరుకుపోతోందని వాపోతున్నారు. దుర్గంధం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు ఏ గ్రామంలో క్లోరినేషన్, దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, బ్లీచింగ్ వంటి పనులు చేపట్టలేదు.

వరద ముంపు..

మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచి బురదమయంగా తయారయ్యాయి. రెండు రోజుల క్రితం కమలాపురంలో ఎర్రవాగు పొంగి ప్రవహించడంతో ఇందిరానగర్, భగత్‌సింగ్ వీధులు, ఇళ్లలోకి వరదనీరు చేరిన విషయం తెలిసిందే. వరదనీరు చేరిన సమయంలో రెండు రోజులు హడావిడి చేసిన అధికారులు వరదనీరు తగ్గి రెండు రోజులు అవుతున్నా ఆయా ప్రాంతాలతోపాటు పునరావాస కేంద్రానికి వినియోగించిన జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసనకు వెదజల్లుతోంది. దీతో ప్రజలు, పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన, ఎదుట రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలిగించకపోవడంతో వీధులు కంపుకొడుతున్నాయి. జిల్లా మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం, దోమల నివారణకు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బురద పేరుకుపోయిన జెడ్పీ పాఠశాల మైదానం

దోమల బెడద ఎక్కువైంది



ఎర్రవాగునీరు జనావాసాలను ముంచెత్తడం, ఇళ్లలోకి చేరడంతో దుర్వాసన వస్తోంది. దీనికితోడు చీకటి పడితే దోమల బెడద తట్టుకోలేకపోతున్నాం. అధికారులు స్పందించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి.

– కొత్తపేట స్వరూప, భగత్‌సింగ్ నగర్, కమలాపురం

తక్షణమే చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ లేకపోవడంతో తెప్పించాం. అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి పారిశుద్ధ్యం, దోమల నివారణకు ఫాగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం.

– బద్రునాయక్, ఎంపీడీఓ

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలి

- మండల ప్రత్యేక అధికారి రాంపతి
- ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న రాంపతి

ఏటూరునాగారం: గణపతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గణపతి కమిటీ ఉత్సవాల నిర్వాహకులు, పలు శాఖల అధికారులతో గ్రామ పెద్దలతో నవ రాత్రులపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పోలీస్ శాఖతోపాటు రెవెన్యూ, మత్స్యశాఖ, ఇరిగేషన్, విద్యుత్‌శాఖలతోపాటు పంచాయతీ అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మండలంలోని ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో ప్రత్యేక క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీన అన్ని మండపాల నిర్వాహకులు నిమజ్జనం చేసుకోవాలని కోరారు. శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. అలాగే వినాయకుడి మండపాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్ 9రోజుల పాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకని సంబంధిత ట్రాన్స్‌కో వారికి సమాచారం ఇచ్చి కనెక్షన్ పొందాలన్నారు. పోలీసులు వారు రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఈ అశోక్, మండలాల పంచాయతీ అధికారులు రమాదేవి, వినోద్, సతీష్, సందీప్, శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, కత్తెర శ్రీనివాస్, గౌస్, ఖలీల్, బందారు లక్ష్మణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

సీఐ మల్లేశ్

చిట్యాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీఐ మల్లేశ్, ఎంపీడీఓ జయశ్రీ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను వారు తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. హాస్టల్‌లోని వంట గదిని పరిశీలించారు.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల: నిత్యం అప్రమత్తంగా ఉంటూ, నాణ్యమైన విద్యా, భోజనం అందించాలని ఎంపీడీఓ అనిత, ఎస్సై సుధాకర్, ఎంపీఓ సురేస్ కస్తూర్బా బాలికా విద్యాలయ ఎస్ఓ స్వప్నకు సూచించారు. మంగళవారం కేజీబీవీని వారు తనిఖీ చేపట్టారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

- నర్కొల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీకాంత్

ములుగు రూరల్: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా నార్కొటిక్ సీఐ శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేషం ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. విద్యార్థులు గంజాయి మహమ్మారికి దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని చెప్పారు. మాదక ద్రవ్యాల నివారణతో సమాజ అభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్యం, యువతకు భద్రమైన భవిష్యత్ ఉంటుందని తెలిపారు. 1985లో అమలులోకి వచ్చిన నార్కోటిక్ డ్రగ్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం ప్రకారం డ్రగ్స్ వినియోగం, రవాణాపై కఠిన శిక్షలు విధించనున్నట్లు తెలిపారు. 1908టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి డ్రగ్స్ బాధితులు సాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మల్లేషం మాట్లాడుతూ కళాశాలలో యాంటి డ్రగ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాంటీడ్రగ్ కమిటీ కన్వీనర్ అనిల్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, అధ్యాపకులు కవిత, భాస్కర్, సరిత, శిరీష, రాధిక, ఉదయశ్రీ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి


అవగాహన కలిగిస్తున్న డాక్టర్ భాస్కర్

వెంకటాపురం(కె): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి భాస్కర్ ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని పెంకవాగు గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ భాస్కర్ గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల బారిన పడకుండా దోమతెరలను వినియోగించుకోవాలని సూచించారు. ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వలేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున విషజ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, కాచి చలార్చిన నీటినే తాగాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, సభ్యులు హనుమంతు, స్వరూప, పద్మ, నరేష్, రమాదేవి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


గోవిందరావుపేట: చెక్కులను అందజేస్తున్న అశోక్



వాజేడు: చెక్కులను పంపిణీ చేస్తున్న విక్రాంత్

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి, బుస్సాపూర్, గోవిందరావుపేట, గాంధీనగర్, పస్రా, లక్నవరం గ్రామాలకు చెందిన పలువురికి మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేసుకున్న వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పేరూరు గ్రామస్తులకు..

వాజేడు: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. పేరూరు గ్రామానికి చెందిన ఎస్‌కే నసీమా, చెరుకూరుకు చెందిన కాకర్ల పూడి లావణ్య, మొరుమూరుకు చెందిన బోదెబోయిన చంద్రశేఖర్ , రాంపురం గ్రామానికి చెందిన ఇస్తారికి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి ఆర్థిక సాయం కోసం ప్రతీ మండలానికి రూ.5 లక్షలు కేటాయించబడుతుందని వెల్లడించారు. అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, ఎస్‌కే ఖాజావలి, శ్రీను, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

టీఎల్‌ఎంతో విద్యార్థుల్లో సృజనాత్మకత


రేగొండ: బోధనోపకరణాల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

రేగొండ: టీఎల్‌ఎం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుందని మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాలలో 1 నుంచి 5వ తరగతులకు సంబంధించిన మండల స్థాయి టీఎల్‌ఎం (టీచర్ లర్నింగ్ మెటీరియల్) మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనలో వినూత్న పద్ధతులు పాటిస్తూ, పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా చూపించడం కోసం టీఎల్‌ఎం ఉపయోగపడుతుందన్నారు.

చిట్యాల: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకతను తీసుకురావాలని ఎంఈఓ కోడెపాక రఘుపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీచర్స్ లర్నింగ్ మేటిరియల్(టీఎల్‌ఎం) మేళా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ టీఎల్‌ఎం ఉపయోగించడం మూలంగా బోధన సులభతరమై విద్యార్థి త్వరగా నేర్చుకోవాడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నేర్పడంలో సృజనాత్మకత చూపాలని పేర్కొన్నారు.

రావయ్యా.. గణపయ్య

గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. గ్రామాలు, పట్టణాల్లోని వీధికో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. మండపాలను అందంగా ముస్తాబు చేసిన భక్తులు తొమ్మిదిరోజులు గణపయ్యకు ఘనంగా పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. - సాక్షి నెట్‌వర్క్


ఏటూరునాగారం: మట్టి వినాయకులను తయారు చేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


మంగపేట: మండపం ఏర్పాటు చేస్తున్న భక్తులు


వెంకటాపురం(ఎం): నర్సాపూర్ పాఠశాలలో..


వాజేడు: విగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థినులు


గోవిందరావుపేట: చల్వాయి మోడల్ స్కూల్‌లో మట్టి విగ్రహాలతో విద్యార్థులు


వాజేడు: మట్టి విగ్రహాన్ని చూపిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక


సుమన్, అధ్యక్షుడు


జలీల్, ప్రధాన కార్యదర్శి

ములుగు రూరల్: జేడీ మల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బిక్కనూరి సుమన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ జలీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం మల్లంపల్లిలో ప్రెస్ క్లబ్ సమావేశం నిర్వహించి నూతన కమిటీనికి ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా బక్కి నాగరాజు, గాదె సుమన్, కోశాధికారిగా దుబాషి ప్రదీప్, కార్యవర్గ సభ్యులుగా గోల్కొండ రాజు, తడక హరీష్, శ్యాంసుందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. తన ఎన్నికకు సహరించిన తోటి జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుంకరి సంపత్, జాలిగం శ్రీనివాస్, నట్రాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు భరోసా కల్పించాలి

- జంపాల రవీందర్


కార్మికులతో మాట్లాడుతున్న రవీందర్

ఏటూరునాగారం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేస్తున్న కార్మికులకు పూర్తి భరోసా కల్పించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలల వసతి గృహంలో ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో వంట కార్మికులకు పనిచేస్తున్న వారితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. గత 23 సంవత్సరాలుగా వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్న వంట కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వంట కార్మికుల బతుకులు తెలిసిన మంత్రి సీతక్క ఎవరినీ తొలగించకుండా వారికి భరోసా కల్పించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంట ప్రతి నెలా రూ.పది వేల వేతనం వెంటనే అందించే విధంగా కృషి చేయాలన్నారు. 9 నెలల అల్పాహారం బిల్లులు, అయిదు నెలల కోడిగుడ్ల బిల్లులు, వంట బిల్లులు వెంటనే ఇప్పించాలని కోరారు. గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు, సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదా మెనూ చార్జీలు ప్రతీ విద్యార్థికి రూ.25 చెల్లించాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ పరం చేసే కుట్రపూరిత ఆలోచన విధానాలను విరమించుకోవాలని అన్నారు. అన్ని సమస్యలు తెలిసిన మంత్రి సీతక్క వెంటనే పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, సహయ కార్యదర్శి గడ్డం భారతి, పుష్ప, లక్ష్మి, జానకి, భానుమతి, సమ్మక్క, మహేశ్వరి, పార్వతి, సాలమ్మ, కొమురమ్మ, రాజకుమారి, పాపమ్మ, సుధ, హేమ, నర్సమ్మ, నందిని, షఫియా, గోర్బీ, ఖైరున్, సరోజన, శ్వేత పాల్గొన్నారు.

'యూరియా పంపిణీలో ఇష్టారాజ్యం'

కాటారం: యూరియా పంపిణీలో పీఏసీఎస్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రామిల్ల రాజబాబు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పీఏసీఎస్ అధికారులు సామాన్య పేద రైతులకు యూరియా అవసరం ఉన్న ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని అదే వారికి కావాల్సిన వారికి, పైరవీకారులకు పెద్దపీట వేస్తూ అధిక మొత్తంలో యూరియా ఇస్తున్నారని పేర్కొన్నారు. తంబ్ మిషన్, డిజిటల్ మిషన్ పని చేయడం లేదని రైతులకు సాకులు చెపుతూ ఎలాంటి రికార్డులు నమోదు చేయకుండా అనాధికారికంగా యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. రోజంతా లైన్లో నిలబడిన రైతులకు యూరియా ఇవ్వకుండా రాత్రి పూట కొంత మందికి ఇస్తున్నారని అన్నారు. ఈ విషయం జిల్లా సహకార అధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాజబాబు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944